## వార్తా మాధ్యమాలకు విడుదల చేసినది

## హిందూ సమాజం పట్ల సాగుతున్న క్రమానుగత మరియు సంస్థాగతమైన వివక్షను అంతమొందించాలని, ప్రముఖ హిందువుల ఆకాంక్షల సంపుటి.

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23, 2018.**

హిందూ సమాజానికి వ్యతిరేకంగా, క్రమానుగత మరియు సంస్థాగతంగా ప్రబలుతున్న వివక్షను చూసి, కలత చెందిన, సుమారు 100 మంది హిందూ ప్రముఖులు 22.09.2018న, న్యూఢిల్లీలో సమావేశమయినారు. దేశం నలు మూలల నుండి, హాజరయిన వీరిలో ఆధ్యాత్మిక గురువులు, విద్యావేత్తలు, ఇంజనీర్లు, వైద్యులు, పత్రికా రచయితలు మరియు సామాజిక మేధావులు ఉన్నారు. ఈ సమావేశంలో, హిందూ సమాజాన్ని పీడిస్తున్న అనేక రాజ్యాంగ, చట్టపరమైన మరియు ప్రభుత్వ విధాన నిర్ణయాలను గూర్చి సమాలోచనలు జరిగాయి.

'సనాతన ధర్మ' పునాదులపై నిర్మించబడిన భారతీయ నాగరికతకు, వారసునిగా, పెద్ద దిక్కుగా మరియు ధర్మకర్తగా, దానిని కాపాడి, పరిరక్షించి, ప్రోత్సహించవలసిన గురుతర బాధ్యత, భారత ప్రభుత్వానిదేనని, ఈ సమావేశంలో అందరూ భావించడం జరిగింది.

భారతప్రభుత్వానికి మరియు ప్రజానీకానికి సమర్పించడానికి వీలుగా, కొన్ని ముఖ్యమైన హిందూ ఆకాంక్షలను చర్చించి, ఈ "ఆకాంక్షల సంపుటి" ని రూపొందించడమైనది.

**హిందూ ఆకాంక్షల సంపుటి :**

1. హిందువుల పట్ల, భారత ప్రభుత్వము ప్రదర్శిస్తున్న, చట్టపరమైన మరియు సంస్థాగతమైన వివక్షను అంతమొందించాలి. ఈ వివక్ష, మతవిశ్వాసాలతో నిమిత్తం లేకుండా, పౌరసమానత్వ స్ఫూర్తికి, విరుద్ధంగా ఉంది. దీని నివారణకు, రాజ్యాంగములోని, 26 నుండి 30 వరకు ఉన్న అధికరణలను (Articles) సవరించడానికి, పార్లమెంటు సభ్యులు డాక్టర్ సత్యపాల్ సింగ్, 2016 లోనే, లోక్‌సభలో, ప్రవేట్ మెంబర్ బిల్లు (నెం.226) ను ప్రవేశ పెట్టారు. ప్రస్తుతం ఈ బిల్లు పార్లమెంటులో ఉన్నది. ఈ బిల్లును, వచ్చే పార్లమెంట్‌సమావేశాల్లోనే, సత్వరమే ఆమోదించాలని, ఈ హిందూ సమూహము కోరుతున్నది. తద్వారా, హిందువులకు, ఇతరులతో పాటు, క్రింది విషయాలలో, సమాన హక్కులు మరియు అవకాశాలు లభిస్తాయి. అవి

   (అ) ప్రభుత్వ అనవసర జోక్యం లేకుండా, విద్యాసంస్థల నిర్వహణ మరియు అజమాయిషీ సజావుగా జరుగుతుంది.

   (ఆ) హిందూ దేవాలయాలు మరియు దైవక్షేత్రాలపై ప్రభుత్వ పెత్తనం, అనవసర జోక్యం తొలగించబడుతుంది. ఫలితంగా హిందువులకు నిర్వహణ మరియు యాజమాన్య బాధ్యతలు పునరుద్ధరించబడతాయి.

   (ఇ) హిందూ వారసత్వం, నాగరికత మరియు సంస్కృతి, సంరక్షించబడి పునర్వికాసం చెందుతాయి.

   రాజ్యాంగములో నిర్దేశించిన 30 వ అధికరణ పరిధిని విస్తృతపరచడానికి, మెజారిటీగా ఉన్న హిందువులకు రాజ్యాంగ పరిరక్షణ కల్పించడానికి, పార్లమెంట్ సభ్యులు దివంగత షహబుద్దీన్, రాజ్యాంగ సవరణకై ప్రైవేట్ మెంబర్ బిల్లు (నెం. 36) ను, 1995

లో లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లులో రాజ్యాంగము నిర్దేశించిన 'మైనారిటీలు' అనే పదం స్థానంలో పౌరులందరికీ వర్తించే విధంగా 'అన్ని వర్గాల పౌరులు' అనే పదాన్ని చేర్చారు. ఈ విషయముపై, ప్రస్తుత సమావేశములో సమాలోచన జరిపి, గుర్తుచేసుకున్నారు.

2. విదేశీ ప్రభుత్వాలు మరియు వాటి అనుబంధ సంస్థలతో సంబంధాలు కల్గిన, భారత సంస్థలకు విదేశీ ధనము, వెల్లువలా వచ్చి చేరుతున్నది. ఈ అధిక ధన ప్రవాహము వలన, కుటిల ఆలోచనలతో ఉన్న ఈ సంస్థలు, విదేశీ విరాళాలను దుర్వినియోగ పరచి, భారత సమాజంలో ఘర్షణకు మరియు విచ్ఛిన్నతకు, ఆజ్యం పోస్తున్నాయి. కేంద్రంలో, లోగడ ఏ పార్టీ అధికారంలో ఉన్నా, ప్రస్తుత ప్రభుత్వం, చట్టాన్ని పటిష్టవంతముగా అమలు చేయడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నప్పటికీ, విదేశాలనుండి, మన దేశానికి వచ్చి చేరే ధనము మరింతగా పెరుగుతూనే ఉంది. ఈ విషయం క్రింద పట్టికలో సూచించిన, అధికార గణాంక సమాచారము తేటతెల్లము చేస్తున్నది. తత్ఫలితంగా, మన ఆంతరంగిక వ్యవహారాలలో, అనవసర విదేశీ జోక్యం పెరుగుతూనే ఉందని, ఈ హిందూ సమూహము ఆందోళన వ్యక్తం చేస్తున్నది.

| వరుస సంఖ్య | సంవత్సరం | విదేశీ విరాళాల నియంత్రణ చట్టము (FCRA) క్రింద చేరిన మొత్తము | సూచిక |
|---|---|---|---|
| 1. | 2010 - 11 | రూ.10,865 కోట్లు | సమాచార హక్కు చట్టము (RTI) ద్వారా లభించిన సమాచారము MHA LNO: II/21011/58(974)/ 2017-FCRA-MU, తేదీ. 07-11-2017. |
| 2. | 2011 - 12 | రూ.11,935 కోట్లు | |
| 3. | 2012 - 13 | రూ.12,614 కోట్లు | |
| 4. | 2013 - 14 | రూ.14,853 కోట్లు | |
| 5. | 2014 - 15 | రూ.15,297 కోట్లు | |
| 6. | 2015 - 16 | రూ.17,765 కోట్లు | |
| 7. | 2016 - 17 | రూ.18,065 కోట్లు | PIB విడుదల 01-06-2018 తేదీతో MHA |

దేశ గౌరవానికి భంగం కల్గించే, ఈ విదేశీ విరాళాలను, ప్రకృతి వైపరీత్యాలలో సహితం, ఈ సమూహము నిర్ద్వందంగా వ్యతిరేకిస్తున్నది. ఈ పరిస్థితులలో, అవసరమైన ధనాన్ని సమకూర్చుకునే సామర్థ్యము ఈ దేశ ప్రజలకు ఉందని, ఈ హిందూ సమూహము బలంగా విశ్వసిస్తున్నది. భోజనం ఉచితంగా ఎక్కడా లభించదు. భారతదేశం యాచక దేశం కాదు.

అందువలన అన్ని రకాల విదేశీ విరాళాలను (వితరణ శీలత గల ప్రవాస భారతీయ(OCI) విరాళాలను మాత్రం మినహాయించి) పూర్తిగా నిరోధించాలని ఈ సమూహము ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

దీని సాధన కోసం ప్రస్తుతం అమలులో ఉన్న విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (FCRA) ను రద్దు చేసి, క్రొత్త విదేశీ విరాళాల నిషేధ చట్టాన్ని రూపొందించ వలసినదిగా, ఈ హిందూ సమూహము కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నది.

3. హిందూ సాంస్కృతిక విషయాలు, మత సాంప్రదాయాలు, విశ్వాసాలు మరియు చిహ్నాలలో, ప్రభుత్వాలు మరియు వారి అనుబంధ సంస్థలు, అనవసరంగా జోక్యం చేసుకోకూడదు. ఈ జోక్యం లేకుండా హిందువులను కాపాడి, సంరక్షించడానికి వీలుగా సత్వరమే 'మత స్వేచ్ఛా చట్టాన్ని' రూపొందించవలసినదిగా కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సమూహము అర్థిస్తున్నది.

4. కాశ్మీరీ హిందువులపై జరిగిన మారణ హోమము మరియు వేధింపులు, మరలా పునరావృతం కాగూడదని, దానికిగాను కేంద్ర ప్రభుత్వం, సత్వరమే ఈ క్రింది చర్యలు గైకొనాలని, ఈ హిందూ సమూహము అభ్యర్థిస్తున్నది.

   (అ) ప్రస్తుత జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రాన్ని, కాశ్మీర్, లడఖ్ మరియు జమ్మూ రాష్ట్రాలుగా విభజించుట.

   (ఆ) కాశ్మీర్ సమస్యకు మూల కారణమైన అధికరణ 370ను, దానితో పాటు విడుదల చేసిన 1954 రాజ్యాంగ ఉత్తర్వును మరియు జమ్మూ - కాశ్మీర్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణలతో కూడిన అధికరణ 35A ను, వెంటనే రద్దు చేయుట.

5. 2017 - 18 లో సుమారు 14 లక్షల టన్నుల మాంసము / గొడ్డు మాంసము విదేశాలకు ఎగుమతి జరుపబడింది. మాంసపు ఎగుమతిలో భారతదేశము అగ్రస్థానము పొందడం సిగ్గుచేటయిన విషయము. ఇది రాజ్యాంగములోని 'అధికరణ 48' కి పూర్తి వ్యతిరేకంగా ఉన్నది. అధిక ఎగుమతుల వలన, స్థానిక మార్కెట్‌లో, మాంసము ధరలు అమాంతంగా పెరగడం, మాంసపు మాఫియా ఆధిపత్యము పెరగడం జరుగుతూ ఉంది. కావున అన్ని రకాల మాంసపు ఎగుమతులపై, వెనువెంటనే పూర్తి నిషేధము విధించాలని, ఈ సమూహము ప్రభుత్వాన్ని కోరుకుంటున్నది. పూర్తి నిషేధ ఫలితంగా, స్థానిక మార్కెట్‌లో తక్కువ ధరలకు మాంసం లభ్యమవడమే కాకుండా, పర్యావరణంపై దుష్ఫలితాలు కూడా తగ్గుతాయి. ఈ చర్య వలన, సాంఘిక ఘర్షణలు మరియు శాంతి భద్రతల సమస్యలు నివారించబడతాయి.

6. వేల సంఖ్యలో హిందువుల దేవాలయాలు మరియు పవిత్ర క్షేత్రాలు, నిర్లక్ష్యానికి, విధ్వంసానికి గురై, శిథిలావస్థలో ఉండి కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నాయి. అంతే కాకుండా, వేద పాఠశాలలు, సాంప్రదాయ మరియు జానపద కళా రూపాలు, సాహిత్యము, నృత్యము, సంగీతము, చిత్రలేఖనము, శిల్పకళ మరియు నిర్మాణ విజ్ఞాన శాస్త్రం మొదలైనవి సనాతన ధర్మము నిలబడడానికి, సజావుగా వ్యాప్తి చెందడానికి, ప్రధాన వాహికలుగా ఉన్నాయి. వీటికి ప్రోత్సాహము లేక మరియు వీటిని నమ్ముకున్న వారికి జీవనోపాధి లేక క్షీణదశలో ఉన్నాయి. అందువలన వీటిని పునరుజ్జీవింప చేయడానికి, వెంటనే భారత ప్రభుత్వము రూ. 10,000ల కోట్ల ప్రారంభ మూలధనంతో "హిందూ సాంస్కృతిక పునరుద్ధరణ సంస్థ" ను ఏర్పరచాలని, ఈ సమూహము కోరుతున్నది. అంతే కాకుండా ప్రతి సంవత్సరం అంతే మొత్తములో నిధులను కేటాయించి, ఈ నిధులను శిథిలావస్థలో ఉన్న దేవాలయాల పునర్నిర్మాణానికి, పైన ఉదహరించిన, క్షీణ దశలో ఉన్న కళలను ప్రోత్సహించి అభివృద్ధి చేయడానికి వినియోగించాలని, ఈ హిందూ సమూహము ప్రభుత్వాన్ని కోరుతున్నది.

7. భారతీయ జనతా పార్టీ (BJP) తన 2014 ఎన్నికల ప్రణాళికలో "వేధింపులకు గురైన విదేశాలలోని హిందువులకు, భారతదేశము సహజనివాసముగా ఉంటుందని మరియు వారిని శరణార్ధులుగా స్వాగతిస్తాము" అని ప్రకటించింది. ఈ దిశగా, 2016 లో, కేంద్రప్రభుత్వం "పౌరసత్వ చట్ట సవరణ బిల్లు" ను లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈ బిల్లు ఒక ప్రత్యేక కమిటీకి నివేదించబడి ఉన్నది. ఈ బిల్లు లోపభూయిష్టంగా ఉండడమే కాకుండా, దాని రాజ్యాంగ బద్ధత మీద కూడా సందేహాలు ఉన్నాయి. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొంతమంది ప్రజానీకం వ్యక్తపరిచే సమంజసమైన ఆందోళనలను కూడా పరిష్కరించాలని, ఈ సమూహము విజ్ఞప్తి చేస్తున్నది. వీటి పరిష్కారానికి కేంద్రప్రభుత్వం సత్వరమే గైకొనవలసిన చర్యలు

(అ) పార్లమెంటులో ఉన్న "2016 పౌరసత్వ సవరణ బిల్లు" ను ఉపసంహరించుకోవలెను.

(ఆ) రాజ్యాంగములో, ఉపయుక్తంగా ఉండే అధికరణ 11A ను చేర్చి, రాజ్యాంగ సవరణ చేయవలెను.

(ఇ) ఆ తరువాత, "1995 పౌరసత్వ చట్టము" ను సవరణ చేసి "క్రొత్త పౌరసత్వ సవరణ బిల్లు - 2018" ని వచ్చే పార్లమెంటు సమావేశాలలో ప్రవేశపెట్టవలెను.

8. అన్ని భారతీయ భాషల వికాసానికి, సమాన అవకాశాలు ఉండే వాతావరణము కల్పించాలి. భారతీయ భాషల పట్ల, ప్రస్తుతం ఉన్న సంస్థాగతమైన వివక్షను అంతమొందించే విధంగా, భారతీయ భాషలన్నీ పురోగమించడానికి వీలుగా సమాన అవకాశాలు కల్పించాలి. ప్రభుత్వము చూపుతున్న భాషా వివక్ష వలన, భారతదేశంలో, అధిక సంఖ్యలో ప్రజానీకం అభివృద్ధి మరియు న్యాయము పొందలేక పోతున్నారు. భాషలన్నింటికి సమాన అవకాశాలు కల్పిస్తే, ఆర్థిక మరియు సాంస్కృతిక రంగాలలో పునర్వికాసం జరుగుతుందని, ఈ సమూహం గాఢంగా విశ్వసిస్తున్నది.

ప్రముఖ భారతీయ పౌరులు రూపొందించిన ఈ సంపుటిలోని హిందూ ఆకాంక్షలు మరియు విధాన సూచనలు, ప్రభుత్వానికి, చట్ట సభలకు ఉపయుక్తంగా ఉంటాయి. ఈ ఆకాంక్షలు క్రియారూపం దాల్చినట్లయితే, సమాజంలోని ఇతర వర్గాల వారితో సమాన స్థాయిలో, హిందువులకు హక్కులు లభిస్తాయి. భారత ప్రజాస్వామ్య భద్రతకు, పటిష్టతకు ఆయువుపట్టుగా ఉన్న, సమానత్వం, న్యాయం మరియు స్వేచ్ఛా సూత్రాలు, జవసత్వాలు పొంది, డాక్టర్ అంబేద్కర్ మరియు ఇతర రాజ్యాంగ నిర్మాతలు కలలుగన్న ప్రజాస్వామ్యము పరిఢవిల్లుతుంది. ఫలితంగా నిజమైన లౌకికవాద, మత పక్షపాతం లేని చట్టబద్ధపాలన, రాజ్యవ్యవస్థ మరియు రాజ్యపాలన వాస్తవరూపం దాల్చుతాయని ఈ సమూహం గాఢంగా నమ్ముతున్నది.

**- సి. సురేంద్రనాథ్, చెన్నయ్.**

**- డాక్టర్ హరిత పురసల, న్యూఢిల్లీ.**

**- డాక్టర్ ఈశంకూర్ సైకియా, గువహతి.**

**- డాక్టర్ భరత్ గుప్త్, న్యూఢిల్లీ.**

**- తపన్ ఘోష్, కోలకత్తా.**

**(ఈ సమూహము తరపున మరియు**

**ఈ సమూహము కోసం)**